# గౌరీ లంకేష్ హత్యను ఖండించండి

**కన్నడ** పత్రికా రచయిత, సామాజిక కార్యకర్త గౌరీ లంకేష్‌ను బెంగుళూరులో ఆమె ఇంటిముందే హత్యకావించిన దుర్మార్గ చర్యను సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.

కులవివక్షత, అణచివేతలకూ, మతోన్మాదానికీ వ్యతిరేకంగా ఉద్యమాలకు గౌరీ లంకేష్ చురుకుగా మద్దతునిచ్చేవారు. 'గౌరీ లంకేష్' పత్రిక సంపాదకురాలిగా, ముద్రాపకురాలిగా ఉన్నత స్థానాల్లోని వారి అవినీతిపై ఆమె పోరాడారు. పీడితుల, పేదల తరుపున స్థిరంగా నిలిచారు.

గౌరీ లంకేష్ హత్య హిందూమతోన్మాదశక్తులలో పెరుగుతున్న అసహనాన్ని తెలుపుతున్నది. ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలు ప్రచారం చేస్తున్న రకపు మతోన్మాదం, జాతీయోన్మాదాలను వ్యతిరేకిస్తున్న మేధావులపై సాగుతున్న వరుస దాడుల్లో ఇది ఒకటి.

నేరస్తులనూ, వారి వెనుకనున్న శక్తులనూ(వీరికి హిందూమతోన్మాదుల అండదండలున్నాయి) వెంటనే అరెస్టుచేసి తీవ్రంగా శిక్షించాలని డిమాండు చేస్తున్నాము.

**కలకత్తా**
**8-9-2017**

**కేంద్రకమిటి**
**సిపిఐ(ఎం-ఎల్)**

# రోహింగ్యా ప్రజలపై మారణకాండను ఆపాలి

**రోహింగ్యా** ప్రజలపై మయన్మార్ ప్రభుత్వం సాగిస్తున్న మారణకాండను వెంటనే ఆపివేయాలనీ, మయన్మార్, బంగ్లాదేశ్, భారత్‌లు చర్చలద్వారా శాంతియుత పద్ధతిలో రోహింగ్యా ప్రజల నిర్వాసిత సమస్యను పరిష్కరించుకోవాలని సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి డిమాండు చేస్తున్నది.

అరాకాన్ ప్రాంతంలో సారవంత భూములను సాగుచేయటానికి పొరుగునున్న చిట్టగాంగ్ ప్రాంతంనుడి బెంగాలీ ముస్లిముల వలసను బ్రిటీషు వలసపాలకులు ప్రోత్సహించారు. అంతకుముందు కూడ కొంతమేరకు వలసలున్నాయి. వీరందరూ అక్కడే నివసిస్తూ రోహింగ్యాలుగా ప్రత్యేక గుర్తింపు కలిగి వున్నారు. బ్రిటీషు పాలన ముగిసాక, మయన్మార్ ప్రభుత్వం తన దోపిడీ పాలన కాపాడుకొనేందుకు రోహింగ్యా ప్రజలకూ, స్థానిక రఖైన్ ప్రజలకూ మధ్యనా, మెజారిటీగా వున్న బౌద్ధమతస్తులకూ ముస్లిం మైనారిటీలకూ మధ్యనా వున్న వైమనస్యాలను విద్వేషాలుగా రెచ్చగొట్టింది. 1982లో చట్టంచేసి రోహింగ్యాలకు పౌరసత్వం లేకుండా చేసింది.

రోహింగ్యా టెర్రరిస్టులను అణచే పేరిట మయన్మార్ ప్రభుత్వం తన సైన్యాన్ని ఇటీవల ఇక్కడకు పంపింది. రోహింగ్యా గ్రామాలకు గ్రామాలనే తగులబెట్టారనీ, వారి ఆస్తులను లూటీచేసారనీ, మహిళలను బలాత్కరించారనీ ఐక్యరాజ్యసమితి పునరావాస కమీషన్ నివేదిక తెలుపుతున్నది. దీనితో వేలాది రోహింగ్యాలు సరిహద్దులు దాటి బంగ్లాదేశ్, భారత్‌కు శరణార్థులుగా వచ్చారు.

తర్వాత వినియోగించుకునే దృష్టితో, వలస పాలకులు సృష్టించిన అనేక సమస్యలలో ఇది ఒకటి. గత ఏడు దశాబ్దాలుగా సామ్రాజ్యవాదులు రోహింగ్యా ప్రజల సమస్యను పరిష్కరించేందుకు పూనుకోకుండా, వారిపై సాగుతున్న నిర్బంధకాండను మయన్మార్ ప్రభుత్వంపై దాడిచేసి లొంగదీసుకునే సాధనంగా వాడుకుంటూ వచ్చారు. ఈ ఏడాది రోహింగ్యాలపై సాగుతున్న మారణకాండను కూడా సామ్రాజ్యవాదులు ఖండిస్తున్నారు తప్ప సమస్యకు పరిష్కారాన్ని చూపడంలేదు.

రోహింగ్యా ప్రజలపై సాగుతున్న మారణకాండను వ్యతిరేకించమనీ, దీనిని ఆపేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మయన్మార్, బంగ్లాదేశ్, భారత్ ప్రభుత్వాలపై వత్తిడి తేవాలనీ, సామ్రాజ్యవాద దేశాల మోసపూరిత విధానాన్ని బహిర్గతపరచాలనీ ప్రపంచ ప్రజలకు సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.

**కలకత్తా**
**8-9-2017**

**కేంద్రకమిటి**
**సిపిఐ(ఎం-ఎల్)**

## తక్షణ, శాశ్వత వరద, కరవు నివారణ చర్యలు చేపట్టాలి

**అస్సాం,** పశ్చిమబెంగాల్, బీహార్‌లలో కొన్ని ప్రాంతాలు వరదల వినాశనానికి గురికావటంతో లక్షలాదిమంది ఇళ్ళు పంటలూ, ఇతర ఆస్తులు కోల్పోయారు. దేశంలో ఇతర నగరాలతోపాటు ముంబాయి నగరంలో అతివృష్టికి జనజీవనం కొన్నిరోజులపాటు స్థంభించిపోయింది.

రెండు సంవత్సరాల వరుసకరవు తర్వాత, నైరుతీ రుతుపవనాలు పూర్తవుతున్న సమయానికి దేశంలో 630 జిల్లాలకుగానూ 233 జిల్లాల్లో వర్షపాతం తగ్గి కరవు కొనసాగే పరిస్థితి ఏర్పడింది. వర్షపాతం లోటు అత్యధికంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో 37శాతంగా వుండగా, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతంలో 18 శాతంగా వుంది. లోటువున్న మిగిలిన ప్రాంతాలు – హర్యానా (29%), విదర్భ(27%), కేరళ (26%), తూర్పు ఎంపి(25%), దక్షిణ కర్ణాటక(24%), తీర కర్ణాటక(23%), పశ్చిమ ఎంపి(21%), తూర్పు యుపి(19%)గా వున్నాయి. ప్రధాన పంటల్లో నాట్లు పడిన సాగుభూమి విస్తీర్ణం, కరవున్న గత ఏడాదికంటే 11 శాతం తగ్గింది.

కరవు, వరదలు ప్రతిఏడాది తప్పనిసరిగా వచ్చే లక్షణంగా మారాయి. లక్షలాది ప్రజల, ప్రత్యేకించి రైతాంగం, వ్యవసాయకూలీల, జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. గత ఏడు దశాబ్దాల "స్వాతంత్ర" పాలనలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించ పూనుకోలేదు. కొన్ని తక్షణ ఉపశమన చర్యలు మాత్రమే చేపడుతున్నారు. సాంకేతిక మానవశక్తి వున్నదని గొప్పలు చెప్పుకోవటమే తప్ప ప్రకృతి ప్రసాదిత జలవనరులను ప్రజల జీవితాలను మెరుగుపరిచే విధంగా వినియోగించటంలో విఫలమయ్యారు.

కరవు, వరదల నివారణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యపూరిత వైఖరిని కేంద్రకమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. జలవనరులను పర్యావరణానికి హాని కలుగకుండా శాస్త్రీయ విజ్ఞానంపై ఆధారపడిన సమగ్ర జలవినియోగ ప్రణాళికను రూపొందించి అమలుచేయాలని డిమాండు చేస్తున్నది.

రాష్ట్ర కమిటీలు, సానుభూతిపరులు, స్నేహితులు, ప్రజాతంత్రసంస్థలను బాధిత ప్రజలకు మద్దతుగా నిలువమనీ, సాధ్యమైన సహాయమందించమనీ కేంద్రకమిటీ కోరుతున్నది.

**కలకత్తా**
**8-9-2017**

**కేంద్రకమిటీ**
**సిపిఐ(ఎం-ఎల్)**

**OOOO**